# సీఎం ఆశీస్సులతో ఎస్పీఎం తెరిపించిన


మాట్లాడుతున్న సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప

- **ఆశీర్వదిస్తే మరో కంపెనీ తెప్పిస్తా**
- **ప్రజా ఆశీర్వాద సభలో సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనప్ప**

కాగజ్‌నగర్, నవంబర్ 8 : 'ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో కాగజ్‌నగర్ పట్టణంలోని మూతపడిన పేపర్ మిల్లును తిరిగి తెరిపించిన.., అందుకోసం ఎన్నో యాజమాన్యాల దగ్గర తిరిగిని.., నియోజకవర్గ ప్రజల కోసం కష్టపడుతూనే ఉన్న.., నన్ను నమ్మి మూడుసార్లు గెలిపించారు. ఈ సారి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరో కంపెనీ తెప్పిస్తా..' అని ప్రజా ఆశీర్వాద సభలో సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రజలను కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేయడంతో నియోజకవర్గంలోని రోడ్లు, వంతెనలు నిర్మించామన్నారు. విద్య, వైద్యం సమస్యలు తీరాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పోడు రైతులకు పట్టాలు ఇచ్చి, రైతు బంధు, రైతు బీమా అందించిన దేవుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. పోడు పట్టా పొందిన చింతలమానేపల్లి మండలం ఆడెపల్లి గ్రామానికి చెందిన గడ్డం సత్తయ్య, బెజ్జూర్ మండలం బారెగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్ మృతిచెందగా, ప్రభుత్వం రైతు భీమా కింద రూ.5 లక్షల చొప్పున వారం రోజుల్లో వారి నామిని ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గంలో రెసిడెన్సియల్ పాఠశాలలను కళాశాలలుగా మార్చారని, ఇప్పుడు డిగ్రీ కళాశాలలను మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోనప్ప కోరారు. నియోజకవర్గంలో 3 వేల గృహలక్ష్మి ఇండ్లు ఇచ్చినట్లు, మరికొన్ని ఇస్తే ఇంకొందరికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కుమ్రం భీం, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సీఎం కేసీఆర్ సహకారంతో కౌటాల మండలం తాటిపెల్లి గ్రామంలో రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఆ రైతులు సిరులు పండిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ ప్రాంతం వారు పనులు లేక వలస వెళ్లేవారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రెండు పంటలు పండిస్తూ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల వేలాది మంది కూలీలకు ఉపాధి ఇస్తున్న రైతులు తన నియోజకవర్గంలో ఉండడం గర్వంగా ఉందని వివరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్సీలు దండె విఠల్, రఘోత్తం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్లు దస్తగిరి, సులేమాన్ బిన్ సయ్యద్, నియోజకర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

కేసీఆర్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య సతీమణి, మున్సిపల్ మాజీ చైర్మన్ కావేటి సాయిలీల, కొడుకులు మనోహర్, సతీశ్, విజయ్ బీఆర్ఎస్‌లో చేరారు.

### హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం..

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ అనంతరం తిరిగి ఆసిఫాబాద్‌లో సభకు వెళ్లేందుకు హెలిక్యాప్టర్‌లో ఎక్కగా, సాంకేతిక లోపంతో మొరాయించింది. ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గాన ఆసిఫాబాద్ బయల్దేరారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం హెలిక్యాప్టర్ కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లింది.

# ఆదివాసీ బిడ్డగా ఆదరించారు..

- **సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా..**
- **ఆసిఫాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుకుంటున్నం..**
- **మరింత ప్రగతి కోసం ఆశీర్వదించండి**
- **ప్రజా ఆశీర్వాద సభలో ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్, నవంబర్ 8 : 'ముఖ్యమంత్రి కేసీఆర్.. నన్ను ఆదివాసీ బిడ్డగా ఆదరించి, రాజకీయంగా ప్రోత్సహించారు.. ఆయనకు రుణపడి ఉంటా.., మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేసుకొని, పోరాట యోధుడు కుమ్రం భీం పేరు పెట్టుకున్నాం.., నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం. మరింత ప్రగతి కోసం మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించి.. నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి..' అని ఆసిఫాబాద్ అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ప్రజలను కోరారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్ సమీపంలో గల మైదానంలో బుధవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో కోవ లక్ష్మి మాట్లాడారు. ఆ రోజు సీఎం కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమం మొదలుపెట్టిన సమయంలో చాలా మంది ఏం వస్తుందని హేళనచేశారని పేర్కొన్నారు. ఈ రోజు రాష్ట్రంలో, ఆసిఫాబాద్‌లో ఏం జరుగుతున్నదనేది అందరూ చూస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ హయాంలోనే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు కావడంతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఎంతో చక్కగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ భవనాలు నిర్మించుకొని ప్రజలకు పాలన అందిస్తున్నామని చెప్పారు. అలాగే సీఎం కేసీఆర్ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. ఆసిఫాబాద్ ప్రాంతంలోని కుమ్రం భీం ప్రాజెక్టు కాలువకు అటవీ అనుమతులతో పాటు ప్రాజెక్టు మరమత్తుల కోసం రూ.50 కోట్లు మంజూరుచేయాలని.., వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు కాలువల నిర్మాణం చేపట్టాలని.., ఆసిఫాబాద్ మండలం గుండి వాగుపై బ్రిడ్జి ఎత్తు, పొడవు పెంచినట్లు, వర్షాకాలంలోగా పూర్తి చేయాలన్న ప్రజల కోరిక నెరవేర్చాలని.., కెరమెరి మండలం లక్మాపూర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీఎం కేసీఆర్‌ను కోవ లక్ష్మి కోరారు. రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఇప్పటికే రూ.150 కోట్లు మంజూరు చేశారని, పనులు జోరుగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ జీ నగేశ్, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దాన్ రాథోడ్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, సభ ఇన్‌చార్జి లింగంపల్లి కిషన్‌రావు, తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, కుమ్రం భీం మనువడు కుమ్రం సోనేరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, మర్సుకోల సరస్వతి, నాయకులు మల్లేశ్, మల్లికార్జున్ యాదవ్, వెంకన్న, బాలేశ్వర్‌గౌడ్, కోవ అరుణ, కోవ సాయినాథ్, విమలాబాయి, దుర్పదాబాయి, తారిక్, జీవన్, రాజేశ్వర్, అజయ్‌కుమార్, ఇంతియాజ్‌లాలా, అబ్దుల్‌కలాం, సల్మాన్, టాటిపల్లి అశోక్, రఫీక్ జీవని, నియోజవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి

# ప్రగతిపథంలో బెల్లంపల్లి

- **ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా..**
- **ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య**

బెల్లంపల్లి, నవంబర్ 8 : 'సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో తొమ్మిదేండ్లలో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లిన.., పట్టణంలో 10 వేలకు పైగా.., సింగరేణి స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న 7 వేల మందికి, ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న 3 వేల మందికి పట్టాలు పంపిణీ చేసిన.., 30 పడకల దవాఖానను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసుకొని కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నాం.., ఇక్కడే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసుకున్నాం.., పట్టణ నడిబొడ్డున రెండు ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసుకున్నాం.., మళ్లీ ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా..' అని బెల్లంపల్లి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రజలను కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని తిలక్‌స్టేడియం ఆవరణలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో దుర్గం చిన్నయ్య మాట్లాడారు. 350 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ మంజూరు కాగా, 27 కంపెనీలకు అనుమతి వచ్చిందన్నారు. కేటీఆర్ కృషితో బెల్లంపల్లి నడిబొడ్డున రెండు ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. రానున్న కాలంలో కేసీఆర్ ఆశీస్సులతో మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బెల్లంపల్లికి సంబంధం లేని వ్యక్తిని, డబ్బుల సంచులతో వస్తున్న వారిని నమ్మే పరిస్థితిలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు లేరని తెలిపారు. 2018 ఎన్నికల్లో పోటీ చేసి భంగపడి, చిత్తుగా ఓడిపోయిన ఆయన మళ్లీ ఎన్నికల సమయంలో వస్తున్నాడని ఆరోపించారు. ఇక్కడి ప్రజలు నాలుగు సార్లు ఓడించి, హైదారాబాద్‌కు పంపించారని గుర్తు చేశారు. బెల్లంపల్లి ప్రజలకు గోదావరి నీటిని అందించాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను చిన్నయ్య కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల లేదని, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న 12 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయాలని విన్నవించారు. గిరిజనులకు గురుకుల పాఠశాల, తాండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చామని, ఇంకొందరు ఉన్నారని, వారికి కూడా ఇవ్వాలని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కాసిపేట, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో ప్రాజెక్టులకు కాలువలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు మూడోసారి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేశారు.


మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య

### బీఆర్ఎస్‌లో చేరికలు..

సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభలో వామపక్ష పార్టీల నుంచి సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, వైఎస్ఆర్‌టీపీ నుంచి కాశీ సతీశ్, సీపీఐ నుంచి మామిడాల రాజేశంతో పాటు సీపీఎం నుంచి మరో ముగ్గురు నాయకులకు సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ సైడ్‌లైట్స్

### కాగజ్‌నగర్‌లో..

బెజ్జూర్/కాగజ్‌నగర్ టౌన్, నవంబర్ 8 : కాగజ్‌నగర్ పట్టణంలో మధ్యాహ్నం 1:28 గంటలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ దిగారు.

- 1:35 గంటలకు స్టేజ్ పైకి వచ్చారు.
- 1:36 గంటలకు సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు, స్థానిక నాయకులను కలిశారు.
- 1:37 నుంచి 1:44 గంటల వరకు సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రసంగం.
- 1:45 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు.
- 2:14 గంటలకు ప్రసంగం ముగించారు.
- 2:17 గంటలకు హెలిక్యాప్టర్‌లో కూర్చున్నారు. సాంకేతిక లోపంతో వల్ల హెలిక్యాప్టర్ గాల్లోకి లేవలేదు.
- 2:32 గంటలకు ప్రత్యేక బస్సులో ఆసిఫాబాద్‌కు బయల్దేరారు.

### ఆసిఫాబాద్‌లో..

రెబ్బెన, ఆసిఫాబాద్‌టౌన్ నవంబర్ 8 : ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ ప్రారంభంలో ఏపూరి సోమన్న పాడిన పాటలు సభకు వచ్చిన వారిని అలరించాయి. రామక్క పాటకు ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి స్టేప్పులు వేయగా, సభ నినాదాలతో మార్మోగింది.

- 3:04 గంటలకు సభా ప్రాంగణానికి సీఎం కేసీఆర్ చేరుకున్నారు.
- 3:08 గంటలకు స్టేజీపైకి వచ్చారు.
- 3:10 గంటలకు ఒక్క నిమిషం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడారు.
- 3:11 నుంచి 3:20 గంటల వరకు ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై విన్నవించారు.
- 3:20 గంటలకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోనేరు కొనప్ప మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రసంగించాల్సిందిగా కోరారు.
- 3:21 నుంచి 3:41 గంటల వరకు సీఎం కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.
- 24 గంటల విద్యుత్‌పై ప్రసంగిస్తుండగా, ప్రజలు నినాదాలు చేసి సపోర్టు చేశారు.
- ధరణి పోర్టల్ ఉండాలా.., వద్దా.., అని సీఎం కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి అడుగగా, ముక్తకంఠంతో చేతులు ఎత్తి ఉండాలని మద్దతు తెలిపారు.
- రైతు బంధు, రైతు బీమా పథకాల గురించి సీఎం కేసీఆర్ మాట్లాడగా ప్రజల పెద్ద ఎత్తున నినాదాలు చేసి, హర్షం ప్రకటించారు.
- సభలో సీఎం కేసీఆర్ హిందీలో మైనార్టీల సంక్షేమం కోసం సర్కారు చేసిన పనుల గురించి వివరిస్తుండగా, మైనార్టీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి రూరల్, నవంబర్ 8 : మధ్యాహ్నం 2 గంటల నుంచి సీఎం కేసీఆర్ సభా వేదిక వద్దకు వచ్చేవరకు ధూంధాం కళాకారులు తమ ఆటపాటలతో అలరించారు

- ప్రజలను తిలక్ క్రీడామైదానంలోకి ఆహ్వానించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య వేదికపై నుంచి ప్రసంగాన్ని కొనసాగించారు
- సాయంత్రం 4:06 గంటలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ తిలక్ క్రీడామైదానంపై చక్కర్లు కొట్టింది. కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు, కార్యకర్తలు గులాబీ కండువాలు గాలిలో తిప్పుతూ, కేరింతలు కొట్టారు.
- 4:10 గంటలకు ల్యాండ్ అయ్యారు. హెలిప్యాడ్ నుంచి సీఎం కేసీఆర్ ప్రత్యేక బస్సులో వేదిక వద్దకు చేరుకున్నారు. వేదికమీదికి వస్తుండగా, కళాకారులు మిట్టపల్లి సురేందర్, తైదలబాపు తమ పాటలతో సభలో జనాన్ని ఉర్రూతలూగించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య సాదరంగా తోడ్కొని వచ్చారు.
- 4:18 గంటలకు సీఎం వేదికనలంకరించారు.
- 4:20 నుంచి 4:30 వరకు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య సీఎం కేసీఆర్ పథకాలను వేదికపై చదివి వినిపించారు. అనంతరం సీఎం కేసీఆర్ సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.
- 4:31 నుంచి 4:51 వరకు సీఎం కేసీఆర్ ప్రసంగించారు.
- 4:51కు సీఎం కేసీఆర్ వేదిక దిగి, ప్రత్యేక బస్సులో హెలిప్యాడ్ వద్దకు బయల్దేరారు.
- 4:57 గంటలకు హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ బయల్దేరారు.